

19వ వసంతంలోకి ...

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

సోమవారం,15 డిశంబర్ 2025

8 పేజీలు


## ముందే కూసిన కోడి..

# పందాలకు రె'ఢీ'



**ఏలూరు,ఉమ్మడిప.గో.జిల్లా సూర్యబ్యూరో :** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సాంప్రదాయబద్ధంగా వస్తున్న సంక్రాంతి పర్వదినానికి ముందుగా జిల్లాలో భారీ స్థాయిలో పందాల నిర్వహణకు పలువురు సంసిద్ధులవుతు న్నారు. ప్రతి సంవత్సరం కోడి పందాల శిబిరాలపై పోలీసులు దాడి చేయడం, కత్తులు తయారు చేసే వారిపై బైండోవర్ కేసులుపెట్టడంజరుగుతోంది. కోళ్లకు ప్రత్యేక శిక్షణ, బలవర్ధక ఆహారం సమకూర్చడం పరిపాటి అయింది. సంక్రాంతికి ముందే, నవంబరు నెల నుండే కోడిపందాల రాయుళ్లు కోడిపందాలు వేయడానికి సిద్ధపడుతున్నారు. బరిలోకి దిగే ప్రత్యేక జాతి కోడి పుంజులను అధిక ధరలకు కొని, నిరంతరం పౌష్టికాహారం వాటికి పెడుతూ, కోడికి కత్తులు కట్టి శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. ఇంకా మరికొన్నిచోట్ల అప్పుడే కోడిపందాలు జరుగుతున్నాయి.వాటిపై అప్పుడప్పుడు,అక్కడక్కడ పోలీసులు దాడులుచేసి అదుపులోకి తీసుకుంటున్నారు. కాగా సంక్రాంతి పర్వదినం ముందు 4 రోజుల నుండి ఉమ్మడి జిల్లాలో అటు మెట్ట ప్రాంతం,అటు డెల్టా ప్రాంతంలో జోరుగా పందాలురాత్రింబవళ్లు జరగడం ఆనవాయితీ .భీమవరం పరిసరాల్లో ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహిస్తారు.దీనికి తోడు మద్యం జోరుగా విక్రయాలు, గుండాట,కోసాట, పేకాట వంటి జూద క్రీడలు జరుగుతాయి. తెలంగాణ,కర్ణాటక తదితర రాష్ట్రాల నుండి కూడా పలువురు ప్రముఖులు వచ్చి కోడిపందాలను తిలకిస్తారు. కోడిపందాల బరిలోకి మహిళలు కూడా దిగడం అక్కడక్కడ జరుగుతోంది.దేశ, విదేశాల్లో నివసిస్తున్న జిల్లా వాసులు,ఉమ్మడి జిల్లా స్థానిక ప్రజలు,యువకులు,రాజకీయ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు సంక్రాంతి పండుగలో పాల్గొనికోడిపందాలను ప్రారంభించి అందరినీ ఉత్సాహపరచటం షరా మామూలే.కాగా సాంప్రదాయబద్ధంగా ఆనందో త్సాహాల మధ్య ప్రజలు ఈ జిల్లాలో సంక్రాంతిపండుగ జరుపుకుంటారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ,పోలీసుల ఆంక్షలు, హడావుడి జరిగినప్పటికీ, ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు ప్రభుత్వం ఇచ్చే మౌఖిక ఆదేశాల ప్రకారం పందాలు

- తరువాయి 2లో..

### చింతంపల్లి గ్రామ శివారులో కోడిపందాల శిబిరంపై దాడి

**చింతలపూడి, మేజర్‌న్యూస్ :**చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యములో ఎస్ఐ సతీష్ కుమార్‌కి రాబడిన సమాచారం మేరకు చింతలపూడి మండలం చింతంపల్లి గ్రామ శివారులో కోడిపందాలు శిబిరం పైన పోలీసులు ఆదివారం దాడి చేశారు. 6గిరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 4200, ఒక కోడి పుంజు స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు చేశారు.

## నేరాల నిరోధానికి,నేరస్తుల జాడ కనిపెట్టేందుకు ఈ - వెరిఫికేషన్ యాప్



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** నేరాలను నిరోధించేందుకు,నేరస్తుల జాడను కనిపెట్టేందుకు ప్రస్తుతం ఈ – వెరిఫికేషన్ యాప్ సిద్ధంగా ఉందని, వీటి ద్వారా కొత్త వ్యక్తుల వివరాలు వెంటనే తెలుసుకోవచ్చని జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కొత్త వ్యక్తుల వివరాలు తెలుసుకునేందుకు 90590 55005 నంబర్ వివరాలు పంపి తద్వారా వారి వివరాలు

- తరువాయి 2లో..

## 24 గంటల్లోనే చోరీ సొత్తు స్వాధీనం - ముగ్గురు నిందితుల అరెస్టు



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** 24 గంటల్లోనే సుమారు 4లక్షల 10వేల విలువైన చోరీ సొత్తును స్వాధీనపరచుకొని,ముగ్గురు నిందితులను అరెస్టు చేసి జంగారెడ్డిగూడెం పోలీసులు తమ ప్రతిభను

- తరువాయి 2లో..

# దశాబ్దాలుగా తీరని వంతెన కల

- కోటపాడు - చీపురుగూడెం ప్రజల ఇక్కట్లు !
- వరద సమయంలో సుదూర ప్రయాణం ! - వర్షాకాలంలో తిప్పలే తిప్పలు !
- మంత్రి సారధ్యంలోనైనా వంతెనలు నిర్మాణం అవుతాయా ?






**చాట్రాయి,మేజర్‌న్యూస్:** చాట్రాయి మండలంలోని కోటపాడు చీపురుగూడెం ప్రజల తమ్మిలేరు కాలవపై వంతెన నిర్మాణాలుదశాబ్దాలుగా తీరని కలగా మిగిలాయి. తెలంగాణ రాష్ట్రం బేతుపల్లి గంగారం నుండి వచ్చే వరద నీరు మండలంలోని మంకొల్లు వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్ లో చేరుతుంది. వర్షాకాలం 4 నెలలతో పాటు తుఫాను సమయాలలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది.దీంతో వర్షాకాలంలో చింతలపూడి తో పాటు తెలంగాణ ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి వీలుకాక ఇబ్బందులు పడుతూఉంటారు.దశాబ్దాలుగా అధికారులకు ప్రజాప్రతినిధులకు కోటపాడు చీపురుగూడెం వాగుల వద్ద వంతెనలునిర్మాణంచేపట్టాలని విన్నవిస్తున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యం అంటున్నారు.

**-కోటపాడు,చీపురుగూడెం ప్రజలఇక్కట్లు-** చాట్రాయి మండలంలోని కోటపాడు,

- తరువాయి 2లో..

## అర్హత కలిగిన

# ప్రతి పేదవాడికి స్వంత ఇల్లు

- రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి
- ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు,ఆప్కాబ్ చైర్మన్ గన్ని విరాంజనేయులు





**నిడమర్రు,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవాడికి స్వంత ఇల్లు అందిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నిడమర్రు మండలం చిననింద్రకొలను ఆదివారం పేదల గృహ కాలనీని మంత్రి పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగాసామూహికగృహప్రవేశాల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.గృహ లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను మంత్రి అందించారు.మంత్రి పార్థసారథి మాట్లాడుతూ త2029 నాటికి రాష్ట్రంలో స్వంత ఇళ్ళు లేని పేదవాడు ఉండకూడదన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు.రాష్ట్రంలో 20 వేల కోట్ల రూపాయలతో పేదప్రజలకు గృహాలు నిర్మిస్తున్నామని, ఇప్పటివరకు తమ ప్రభుత్వం 3 లక్షల

- తరువాయి 2లో..

# పిఠాపురం జడ్‌పి హైస్కూల్ ఘటన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఏలూరు,మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గం ఎండపల్లి జడ్‌పి హైస్కూల్‌లో జరిగిన షెడ్యూల్ కాస్ట్ అట్రాసిటీని దాచిపెట్టే ప్రయత్నాలను ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేతాళ సుదర్శన్ పేర్కొన్నారు. మాల ఉద్యోగుల సంఘం గౌరవ జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్కు ఈ సంఘటనపై ఫిర్యాదు చేయడం జరిగింది. పిఠాపురం నియోజకవర్గం, యు.కొత్తపల్లి మండలం,ఎండపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షెడ్యూల్ కాస్ట్‌కు చెందిన పసి పిల్లలపై జరిగిన ఘోరమైన కుల వివక్ష, మానసిక వేధింపులు, అవమానాల సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. ఈ ఘటనకు ప్రధాన బాధ్యుడు కాపు కులానికి చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు శ్రీనుబాబు.అతడు తరగతి గదిలోనే షెడ్యూల్ కాస్ట్ పిల్లలను కులపేర్లతో దూషించడం, వారి తల్లిదండ్రులను అవమానించడం, పిల్లల్లో భయం నాటడం వంటి చర్యలకు పాల్పడ్డాడు. ఇది స్పష్టంగా ఎస్సీ ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టం–1989 కింద శిక్షార్హమైన నేరం.అయితే,ఈ నేరాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత ఉన్న హెడ్మాస్టర్ (ఎస్సీ వర్గానికి చెందినవాడు),ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది ఈ కుల వివక్షను ఆపకుండా, ఇంగ్లీష్ టీచర్‌ను కాపాడే ప్రయత్నాలు చేసి,ఈ దుర్మార్గాన్ని కొనసాగించడానికి సహకరించారు. ఎస్సీ వర్గానికి చెందినవారైనా సరే, నేరాన్ని దాచిపెట్టినప్పుడు వారు కూడా నేరస్తులే అన్నది స్పష్టం. షెడ్యూల్ కులాల బాధిత కులానికి చెందిన కూటమి ప్రభుత్వ అధికార ప్రతినిధి బాధిత వర్గానికి శత్రువుగా మారడం అత్యంత విచారకరం.

దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము.విద్యార్థులే మహాసేన రాజేష్ దిష్టిబొమ్మను తగలబెట్టారంటే అతను పట్ల షెడ్యూల్ కులాలలో ఎలాంటి గౌరవం ఉందో అర్థం అవుతుంది. కేసును సాధారణ కేసుగా మార్చే కుట్ర ఈ సంఘటనను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుగా నమోదు చేయకుండా 'పిల్లల మధ్య చిన్న గొడవ'గా లేదా "సాధారణ ఘటన"గా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.కనుక ఈ ఘటనకు బాధ్యులను ఎస్సి,ఎస్టి కేసు కింద పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని సుదర్శన్ జాతీయ మానవ హక్కుల సంఘాన్ని కోరారు.

# దశాబ్దాలుగా తీరని వంతెన కల

**మొదటిపేజీ తరువాయి**

చీపురుగూడెం, మర్రిబంధం ,వందలాది మంది మంగపేట గ్రామాల ప్రజలు ప్రతినిత్యం వందలాది మంది చింతలపూడి వెళ్లాల్సి ఉంటుంది. వివిధ కుటుంబ అవసరాల నిమిత్తం, నిత్యవసర సరుకుల కోసం, ఆరోగ్య పరమైన ఇబ్బందుల పరిష్కారం కోసం ఆసుపత్రులకు అధిక శాతం ప్రజలు చింతలపూడి పైనే ఆధారపడి ఉంటారు. ముఖ్యంగా విద్యార్థులు కళాశాలలకు వ్యవసాయ అవసరాల నిమిత్తం రైతులు కూడా చింతలపూడి వెళ్ళవలసి ఉంటుంది అయితే వర్షాకాలంతో పాటు వరదల సమయంలో ఐదు నెలల పాటు ఏటి నుండి వరద ఉద్రత కారణంగా రాకపోకలు స్తంభిస్తాయి. వరద సమయంలో సుదూర ప్రయాణం: బేతుపల్లి నుండి వరద వచ్చే సమయంలో కోటపాడు చీపురుగూడెం గ్రామ పంచాయితీల ప్రజలు చింతలపూడి తో పాటు సత్తుపల్లి దమ్మపేట అశ్వరావుపేట భద్రాచలం ఖమ్మం వంటి పట్టణాలకు వెళ్లాలంటే సుదూర ప్రాంతం ప్రయాణం చేసి వెళ్లాల్సి ఉంటుందని ప్రజలు తెలుపుతున్నారు. వరద కారణంగా వాహనాలు రాకపోకలు స్తంభించడంతో పదిహేను కిలోమీటర్ల పైబడి దూరం ప్రయాణం చేసి గమ్యస్థానాలను చేరాల్సి ఉంటుంది. దీంతో ప్రయాణ భారంతో పాటు ఖర్చులు కూడా అధికమవుతాయని పేర్కొన్నారు. కోటపాడు, చీపురుగూడెం ఏటి వద్ద వర్షాకాలంలో పోలీసు మరియు రెవెన్యూ శాఖ అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేస్తారు.

– వర్షాకాలంలో తిప్పలే తిప్పలు –వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలు తిప్పలు చెప్పనలవి కాదు. ముఖ్యంగా ఆయకట్టు ప్రాంతంలో ఉన్న రైతులు పంటకు కావలసిన ఎరువులు, విత్తనాలు, పంట దిగుబడి తర్వాత తోలకాల వాహనాల వారు రాకపోకలు సాగించడానికి పడే ఇబ్బందులు వర్ణనాతీతం అనే చెప్పాలి. వర్షాకాలంలో వరద ఉధృతి కారణంగా ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు ట్రాక్టర్లు సైతం వెళ్లడానికి వీలుపడదు. కొందరు రైతులు తప్పని పరిస్థితుల్లో వరదలోనే రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇలా రాకపోకలు సాగించే సమయంలో వరద కారణంగా నాచు పట్టి జారిపోతూ ఉంటారు. దీంతో పలుమార్లు చిన్నపాటి ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా కోకొల్లలు అనే చెప్పాలి. చింతలపూడి అత్యవసర పనుల మీద వెళ్లేవారు, విద్యార్థులు దగ్గర దారి కావడంతో ప్రమాదమని తెలిసినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఇదే మార్గాన్ని ఆశ్రయిస్తారు.

– మంత్రి సారథ్యంలో వంతెనలు పూర్తవుతాయా ? –చాట్రాయి మండలం నూజివీడులో కలిసి ఉండటం ప్రస్తుతానికి కలిసి వచ్చే అంశంగా చెప్పుకోవాలి. ఎందుకంటే ప్రస్తుతం నూజివీడు శాసనసభ్యులు కొలుసు పార్థసారధి మంత్రిగా ఉండటం కూడా ఈ ప్రాంత ప్రజలు ఆశలు,దశాబ్దాల కల నెరవేరే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు ఇప్పటికే ఈ ప్రాంత నాయకులు మంత్రి దృష్టికి వంతెన సమస్యను తీసుకువెళ్లినట్లు తెలిపారు. కొసమెరుపు ఏమిటంటే. మంత్రి కొలుసు పార్థసారధి సారథ్యంలో, కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో వంతెన పూర్తయి ఈ ప్రాంత ప్రజల మార్గం సుగమం కావాలని ప్రతి ఒక్కరు ఆశపడుతున్నారు.

# 24 గంటల్లోనే చోరీ సొత్తు స్వాధీనం - ముగ్గురు నిందితుల అరెస్టు

**మొదటిపేజీ తరువాయి**

చూపారు. ఏఎస్‌పి సుస్మిత రామనాథన్ ఆదివారం సాయంత్రం చోరీ జరిగిన విధానం,సొత్తును పోలీసు అధికారులు ఏ విధంగా స్వాధీన పరుచుకున్నారో మీడియాకు వివరించారు. మండలంలోని తిరుమలపురం గ్రామానికి చెందిన కనుపర్తి లక్ష్మీ నరసింహ ఆనంద్ కుమార్ తన ఇంటిలో ఈనెల 13వ తేదీన తాళం వేసిన తన ఇంటి తాళాలు దొంగలు పగుల కొట్టి, ఇంటిలో ఉన్న వెండి సామాన్లు రూ.50వేలు విలువ గలవి చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ కె.పిఎస్ కిషోర్ పర్యవేక్షణలో,జంగారెడ్డిగూడెం డిఎస్పి సుస్మిత రామనాథన్ సూచనల మేరకు సీఐ ఎం.వి సుభాష్, ఎస్సై ఎన్ వీరప్రసాద్,పోలీసు సిబ్బంది ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు జంగారెడ్డిగూడెం నుండి కొవ్వూరు వెళ్లే రోడ్డులోని ఫైర్ స్టేషన్ వద్ద మధ్యవర్తుల సమక్షంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో స్విఫ్ట్ డిజైర్ కార్ నెంబర్ ఏపీ 39 సీజెడ్ 1071లోని ఇద్దరు వ్యక్తులను, ఏపీ 37 బిఏ 6752 నెంబర్ మోటార్ సైకిల్ పై వస్తున్న ఒక వ్యక్తిని ఆపి, ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వీరిలో ముత్యాల గణేష్,శీలం ఆంజనేయులు,కటారి సుబ్రహ్మణ్యం లను ముగ్గురిని అరెస్టు చేశామని తెలిపారు. ఈ నిందితులకు గతంలో పలు స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయని,వీరందరిదీ మండలంలోని పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన వారేనని తెలిపారు. వీరి వద్ద నుండి రూ. 4లక్షల10వేలు విలువ గల వెండి వస్తువులు, మారుతి కార్,ఎల్ఈడి టీవీ,పూజకు ఉపయోగించే వెండి,బంగారు వస్తువులను, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీన పరుచుకున్నామని తెలిపారు.ఈ దొంగతనంలో చోరీ జరిగిన వస్తువులను, నిందితుల ను అరెస్టు చేయడంలో కృషిచేసిన సిఐ ఎంవి సుభాష్, ఎస్సై వీరప్రసాద్, ఎన్ఐ నండూరి సంపత్ కుమార్, పిసీలు ఎన్ రమేష్, ఎస్.కె షాన్ బాబు లను డీఎస్పీ సుస్మిత అభినందించారు.

## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీని ప్రారంభించిన మంత్రి పార్థసారధి

**ఇంధన పొదుపుపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కలిగించాలి**



**ఉంగుటూరు, మేజర్‌న్యూస్ :** ఇంధన పొదుపుపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కలిగించాలని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఆదివారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీ ని జెండా ఊపి మంత్రి పార్థసారధి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ విద్యుత్, ఇంధన వనరులను ఆదా చేసే విధానంపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కలిగించాలన్నారు. సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగం, పొదుపు పై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జిల్లాలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు పెద్దఎత్తున నిర్వహించాలని, విద్యుత్ ఆదాపై స్టార్ రేటెడ్ ఉన్న ఎల్.ఈ.డి., బల్బులు, నాణ్యమైన విద్యుత్ పరికరాల వినియోగం, విద్యుత్ పొదుపు చేయడంపై ప్రజలకు అవగాహన సమావేశాలు, ర్యాలీ లు నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, వడ్డీలు కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ పి. సాల్మన్ రాజ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్), కె. ఎం. అంబేద్కర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ముందే కూసిన కోడి.. పందాలకు రె 'ఢీ'

**మొదటిపేజీ తరువాయి**

యధావిధిగా జరగడం రివాజుగా జరుగుతున్నదే. ఇప్పుడు అక్కడక్కడ కోడిపందాలు జరగడం, వారిని అదుపులోకి తీసుకోవడం జరుగుతోంది. ఏది ఏమైనా, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, అత్యున్నత న్యాయస్థానాల ఆదేశాలు, పోలీసుల ఆంక్షలు ఎన్ని ఉన్నా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గత కొన్ని దశాబ్దాలుగా కోడిపందాలు జరగడం, చివరకు కోడి గెలవడం కూడా ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయమే.

## నేరాల నిరోధానికి,నేరస్తుల జాడ కనిపెట్టేందుకు ఈ - వెరిఫికేషన్ యాప్

**మొదటిపేజీ తరువాయి**

సులభంగా తెలుసుకోవచ్చని ఎస్పీ తెలిపారు. ఈ వెరిఫికేషన్ ద్వారా ఫ్రీ మ్యాట్రిమోనీ, హోటల్స్ ,హాస్పిటల్స్, రిసార్ట్స్,బిజినెస్ ,హోటల్స్,సర్వీస్ అపార్ట్మెంట్స్,గిగ్ వర్కర్స్, ఆటో డ్రైవర్లు కొత్త వారినీ వెరిఫికేషన్ చేసే వీలుంటుందని అన్నారు.ఒకవేళ వారు ఇచ్చిన ఆధార్ కార్డు డ్రైవింగ్ లైసెన్స్ వంటివి ఫేక్ అయినప్పటికీ ఈ – వెరిఫికేషన్ ద్వారా వాటిని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వవచ్చని దీని ద్వారా నేరస్థుల జాడ తెలుసుకొనేందుకు మరింత సులభతరం అవుతుందని అన్నారు.

# అర్హత కలిగిన ప్రతి పేదవాడికి స్వంత ఇల్లు

**మొదటిపేజీ తరువాయి**

గృహాల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించిందన్నారు.ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అమలు చేయగల సమర్థత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఉందన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా అవకతవకలకు పాల్పడి,10 లక్షల కోట్ల రూపాయల అప్పులతో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, ముఖ్యమంత్రి పాలనాదక్షతతో రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నదన్నారు. 2014–19 లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసి నిర్మాణ దశలో ఉన్న పేదల ఇళ్లకు సంబంధించి 8 లక్షల ఇళ్లకు తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసిందన్న ఒకేఒక్క కారణంతో గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులను తమ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి 2200 కోట్ల రూపాయలు కేటాయించి ప్రతీ నియోజకవర్గానికి 10 నుండి 15 కోట్ల రూపాయలు అందించారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ నిడమర్రు మండలంలో అర్హులైన 100 మంది పేదలున్నారని, వారికి ఇళ్ళు మంజూరు చేయాలని కోరారు.

2014–19 సమయంలో ఇళ్ళు నిర్మించుకున్న పేదలకు చెల్లించాల్సిన బిల్లులు 8. 5 కోట్ల రూపాయల వరకు బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించాలని కోరారు. పేదల ఇళ్ళ కాలనీలో నీటి సౌకర్యం,ఏలూరు కాల్వ నుండి నీరు సరఫరా చేయాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి స్పందిస్తూ ఎమ్మెల్యే కోరిన వాటికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, గృహ నిర్మాణ శాఖ అధికారి సత్యనారాయణ, ట్రాన్స్కో ఎస్ఈ సాల్మన్ రాజు, ఈఈ అంబేద్కర్ , వడ్డీలు కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, సర్పంచ్ ఎన్.సాయి ప్రియా,ఉపసర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు ,ప్రభుతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నిర్వహిస్తున్న పల్లె పల్లెకు పత్సమట్ల ధర్మరాజు కార్యక్రమం గురించి తెలుసుకుని ఎమ్మెల్యే ను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా కాలనీలో మొక్కను నాటారు.అనంతరం 4 కోట్ల రూపాయలతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను మంత్రి పార్థసారధి శంఖుస్థాపన చేశారు.

# శాస్త్రీయ విద్యాసాధనకై పోరాడుదాం




– ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు (యు.వి)

**జంగారెడ్డిగూడెం,మేజర్న్యూస్ :** శాస్త్రీయ విద్యాసాధనకై పోరాడాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్యు) రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెంలో ధర్మన్న మెమోరియల్ హాల్ రెండవ రోజు జిల్లా విద్యా వైజ్ఞానిక తరగతులు శాస్త్రీయ విద్యా విధానం అనే క్లాసులో ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు (యు.వి) మాట్లాడుతూ విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో శాస్త్రీయమైన విద్యా విధానం కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంలో ఫాసిస్టు విధానాల్ని అమలు చేస్తూ విద్యా కాషాయకరణ ప్రైవేటుకరణ చేయడానికి సిద్ధమయ్యారని అన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ. భూషణం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 7400 ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ విద్యను ప్రైవేటీకరణ చేసే పీపిపి విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

పోలవరం నియోజవర్గంలో ఉన్న మండలాలను,ఏజెన్సీ ఏరియాను పోలవరం జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.నూతన కమిటీ ఎన్నిక జిల్లా అధ్యక్షుడు కాకి నాని ప్రధాన కార్యదర్శి బి.వినోద్ కుమార్ తో పాటు 11 మంది సభ్యులతో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.

# మోటర్ పంపు వైర్ దొంగతనాలను నివారించేందుకు సహకరించాలి



– పెదవేగి సీఐ సిహెచ్ రాజశేఖర్

**పెదవేగి ,మేజర్ న్యూస్ :** పెదవేగి సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్. రాజశేఖర్ పెదవేగి సర్కిల్ కార్యాలయంలో స్క్రాప్ షాపు పాత సామాన్లు కొనుగోలు చేసే దుకాణాలు యజమానులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సి ఐ సిహెచ్. రాజశేఖర్ మాట్లాడుతూ అన్నదాత అయిన రైతు పొలాలలో ట్రాన్స్ఫార్మర్ వైర్లను దొంగిలించడం వలన కేవలం నష్టం మాత్రమే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాలకు కరెంటు సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడి, రైతులకు మరియు ప్రజలకు ఎంతో నష్టం కలుగుతోంది అని రైతుల జీవనాధారంపై నేరుగా ప్రభావం చూపే ఈ దొంగతనాలను అరికట్టాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని సూచించారు.

ముఖ్యంగా స్క్రాప్ షాపు యజమానులు అనుమానాస్పదంగా కనిపించే రాగి లేదా అల్యూమినియం వైర్లను కొనుగోలు చేయవద్దని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా అపరిచిత వ్యక్తులు పెద్ద మొత్తంలో వైర్లను అమ్మకానికి తీసుకొస్తే, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.ప్రతి స్క్రాప్ కొనుగోలుకు సంబంధించి అమ్మిన వారి పూర్తి వివరాలు, ఆధార్ కార్డు/ఫోన్ నంబర్ సహా రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు.ట్రాన్స్ఫార్మర్ వైర్ దొంగతనాలకు సహకరించే స్క్రాప్ షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని దీనిని గమనించి స్క్రాప్ షాపు ఓనర్లు పోలీసు వారితో సహకరించాలని హెచ్చరించారు.

# చాంబర్స్ కళాశాల మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్కు 2623 మంది హాజరు





**పాలకొల్లు, మేజర్ న్యూస్ :** స్థానిక ఛాంబర్స్ కళాశాలల ఆధ్వర్యంలో ప్రస్తుతం 2025 –2026 సంవత్సరంలో పదో తరగతి ,సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థులలో దాగి ఉన్న ప్రతి భాపాటవాలని వెలికి తీయుటకు చాంబర్స్ కళాశాల ప్రాంగణంలో మెరిట్ స్కాలర్షిప్ టెస్టు 2026 మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించబడినది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఏఎంసి చైర్మన్, కాస్మో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కాంప్లెక్స్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు విచ్చేసి మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేసినారు ఈ సందర్భంగా గాంధీభగవాన్ రాజు మాట్లాడుతూ పాలకొల్లు మండల చుట్టూ ప్రక్కల ప్రాంతాల దిగువ, మధ్యతరగతి కుటుంబాల వారి పిల్లల చదువులకు ఫీజు రాయితీలు ఇస్తూ అత్యున్నత విద్యను అందిస్తూ వారికి చదువు పూర్తి చేస్తూ ఉండగానే మంచి మంచి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తూ ఎనలేని సేవ చేస్తున్న విద్యాసంస్థలు ఛాంబర్ విద్యాసంస్థలని అంటూ ఈ మెరిట్ స్కాలర్షిప్ టెస్టుకు విచ్చేసిన విద్యార్థిని విద్యార్థులకు శుభాభివందనములు తెలియజేశారు,ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ మెరిట్ స్కాలర్షిప్ టెస్టుకు హాజరయ్యే వారి సంఖ్య పెరుగుతుందని ఈరోజు నిర్వహించిన పరీక్షకు 2623 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

సెక్రటరీ కెవి సీతారామరాజు మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా తమ కళాశాల పాఠ్యప్రణాళికలను సక్రమంగా పూర్తి చేసి జిల్లా ,రాష్ట్ర ,యూనివర్సిటీ స్థాయిలలో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ ,తృతీయ స్థానాల్లో ఉండటం తమకు అత్యంత గర్వకారణమని తెలిపారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ టెస్ట్ కు విచ్చేసిన విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం , పరీక్ష పాడ్, పెన్ను , ఇతర పరీక్ష సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

ఈ కార్యక్రమానికి కళాశాల అడిషనల్ చైర్మన్ తట్టవర్తి కృష్ణమూర్తి,ట్రెజరర్ ప్రవీణ్ భాను ,అకాడమిక్ అడ్వైజర్స్ డాక్టర్ ఎబిఎస్ మూర్తి నందుల సీతారామ రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కెవి నరసింహారావు, చాంబర్స్ సెక్రెటరీ కటారి నాగేంద్ర కుమార్ ,తదితరులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది వాలంటీర్లు హాజరయ్యారు,

## శ్రీ మద్ది ఆలయంలో హనుమద్ హెూమం




**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** మండలంలోని గుర్వాయిగూడెం గ్రామం నందు శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నందు 'హనుమద్ హెూమం' ఆలయ అర్చకులు, వేద పండితులు ఆద్వర్యంలో జరిగినది. శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో ఈ హనుమద్ హెూమం ప్రతీ ఆదివారం భక్తులకు ఆర్జిత సేవగా దేవస్థానం వారు నిర్ణయించారు. ఈ హనుమద్ హెూమ కార్యక్రమంలో ప్రత్యక్షంగా కానీ పరోక్షముగా కానీ పాల్గొన్న వారికి మానసిక,శారీరక ఆరోగ్యం తో పాటు మానసిక ప్రశాంతత కలుగునని,విద్యార్ధులకు విద్యా ప్రాప్తి కలుగునని, కుటుంభ శక్యత, ఆన్యోన్య దాంపత్యం కలిగి సంతానం కలిగి సర్వత్ర విజయ చేకూరునని విశ్వాసం. కనుక భక్తులు దేవస్థానం నందు ప్రతీ ఆదివారం జరుగు ఈ హనుమద్ హెూమం నందు పాల్గొనవలసినదిగా ఆలయ సహాయ కమీషనర్,కార్యనిర్వహణాధి కారిణి ఆర్.వి.చందన తెలియజేశారు.

## మద్ది ట్రస్ట్ బోర్డు నియామకానికి నోటిఫికేషన్



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరజిల్లుతున్న జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆలయానికి వార్షికాదాయం రూ. 5కోట్లకు మించి ఉండటంతో ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. బోర్డు సభ్యులుగా నియమించేందుకు అర్హులైన ఆసక్తిగల వ్యక్తులు ఫామ్ 1లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.అర్హతలు నిబంధనలు ఫామ్ 2లో పేర్కొన్నట్లు వెల్లడించింది.ఇది ఎలా ఉండగాఈజీవోపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి సర్క్యులర్ విడుదల కావలసి ఉంది.ఆ తర్వాత అర్హులైన వారు,ఆసక్తి గలవారు ట్రస్ట్ బోర్డు సభ్యులుగా దరఖాస్తులు చేయించుకోవలసి ఉంది.

## బ్రాహ్మణికి 'మోస్ట్ పవర్ఫుల్ ఉమన్ ఇన్ బిజినెస్' అవార్డు

– అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే రాధాకృష్ణ



**తణుకు,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని యువత, మహిళా పారిశ్రామిక వేత్తలకు నారా బ్రాహ్మణి స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు.

ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ముంబయిలో శనివారం రాత్రి బిజినెస్ టుడే ఆధ్వర్యంలో నిర్వహించిన అవారుర్దుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆమెకు 'మోస్ట్ పవర్ఫుల్ ఉమన్ ఇన్ బిజినెస్' అవార్డును అందించారని చెప్పారు.అరుదైన అవార్డు అందుకున్న నారా బ్రాహ్మణికి ఎమ్మెల్యే రాధాకృష్ణ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సొంతం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.


# అంగన్వాడీ కార్యకర్తలకు 5జి సెల్ ఫోన్లు



– పంపిణీ చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు,మేజర్ న్యూస్: నియోజకవర్గంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఉచితంగా 5జిసెల్ ఫోన్ల ను మంత్రి డా.నిమ్మల రామానాయుడు పంపిణీ చేశారు. పాలకొల్లులో ఆయన కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గం మొత్తం మీద 224 మందికి కూటమి నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ సేవల వేగం, పారదర్శకత కోసం స్మార్ట్ టెక్నాలజీని అంగన్వాడీ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 58,204 అంగన్వాడీ కార్యకర్తలకు సెల్ ఫోన్ల పంపిణీకి రూ.75 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే అంగన్వాడీ సిబ్బంది వేతనాలుపెంపు జరిగిందని చెప్పారు.గతంతో పోలిస్తే అంగన్వాడీ కార్యకర్తల గౌరవం, ఆర్థిక భద్రత పెరిగిందన్నారు. రాష్ట్రంలో 5 వేల మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాల స్థాయికి అప్‌గ్రేడ్ చేసిన కూటమి ప్రభుత్వమన్నారు.అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, భవనాలు, త్రాగునీరు, మరుగుదొడ్లు మెరుగు పర్చడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు అంగన్వాడీ కార్యకర్తలపై పని భారం తగ్గించేందుకు యాప్‌ల సంఖ్యను తగ్గించాలనే ప్రతిపాదనతో కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరిందన్నారు.పిల్లల పోషణ, తల్లుల ఆరోగ్య పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరిగేందుకు డిజిటల్ వ్యవస్థ వినియోగమని ,అంగన్వాడీలు ప్రభుత్వానికి కీలక భుజాలని,వారిసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రిరామానాయుడు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి నాయకులుపెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల కబర్డి, బోనం చిన్నబాబు, తుల రామలింగేశ్వరరావు, కొల్లి కొండ ప్రసాద్, పాముల రజిని కుమార్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, ధనాని సూర్యప్రకాష్, పొట్టూరి శ్రీనివాస్,మల్లులవెంకట్,ముప్పిరి సత్య నారాయణ,బిర్డుకోట శేఖర్,దేవరపు దొరబాబు రాయి ప్రసాద్,కలిదిండి రామచంద్ర రాజు,వట్టం గణేష్, అంగర వీరభద్ర కుమార్, పాలవలస తులసీరామ్, బోనం నాని, పీతల శ్రీనివాస్, నెక్కంటి ఆదినారాయణ, కొర సందీప్, దాసరిరతన్‌రాజు, ఎల్లమెల్లి వెంకట్రావు, కుక్కల సత్యనారాయణ, కుక్కల సత్యనారాయణ,పెనుమెత్స శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# వారతిప్పలో వైసీపీ నుండి జనసేనలో చేరిక



మొగల్తూరు,మేజర్ న్యూస్ : మండలంలోని వార తిప్ప గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పెదసింగ్.శ్రీను ఆధ్వర్యంలో సుమారు వంద మంది కార్యకర్తలు వైసిపికి గుడ్ బై చెప్పి జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీలో చేరిన వారికి రాష్ట్ర ప్రభుత్వ విప్ నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు.

ఆదివారం జరిగినఈ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు పవన్ కళ్యాణ్ ఆశయాలు సిద్ధాంతాలు కు అనుగుణంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైలావసంతరావు , మొగల్తూరు సొసైటీ అధ్యక్షులు నిప్పులేటి తారక రామారావు, కొల్లాటి. బాబురావు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని ,ఎం సి వైస్ చైర్మన్ గంగాధర్, దొంగ స్వామి, దొంగ శీను తదితరులు పాల్గొన్నారు.

# బడుగుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు 'వంగవీటి '



– రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతమనేని



పెదవేగి,మేజర్‌న్యూస్ : పెదవేగి మండలం ములక్కాయపాడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయబడిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ఆదివారం ఉదయం స్థానిక కూటమి నాయకులు, గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు. అనంతరం వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి భారీ గజమాలవేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆఖరి వరకు పోరాటం చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వంగవీటి మోహన్ రంగాపేరు రాష్ట్రచరిత్రలోచిరస్థాయిగా నిలిచిపోతుం దన్నారు, వారి ఆశయాలు సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు.తలుపా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన చింతమనేని స్థానిక ప్రజలు మహిళలు పూలమాలలు వేసి మన స్వాగతం పలికారు. అనంతరం పినకడిమి గ్రామంలో ఇటీవల పాముకాటుకు గురై అనారోగ్యం బారిన పడి చికిత్స పొందిన పామర్తి.ఝాన్సీ రాణి అనే మహిళకు ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 1లక్షా యాభై వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితురాలి ఇంటివద్దకు వెళ్ళిస్వయంగాచెక్కును అందజేశారు.బాధితురాలి యోగక్షేమాలు,కుటుంబసభ్యుల క్షేమసమాచారాలు అడిగి తెలుసుకున్నారు.

తమన ఆదుకున్న ఎమ్మెల్యే చింతమనేనికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం గ్రామంలో ఉన్నకాలనీరోడ్లను పరిశీలించి, శుభ్రత పాటించకపోవటం పై అసంతృప్తి వ్యక్తం చేసి గ్రామాల్లో డ్రైన్లు రోడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని లేని యెడల గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడతారని తగిలించడం తీసుకోవాలని అధికారుల ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పెదవేగి మండల పార్టీ అధ్యక్షులు ఈడుపుగంటి అనిల్ , పెదవేగి సొసైటీ అధ్యక్షులు తాతా సత్యనారాయణ , ఎంపీటీసీ కొట్టు నరేష్, పెన్మెత్స జయప్రకాష్ నారాయణ, సుగసాని గంగయ్య సహా పలువురు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు గంగానమ్మ అమ్మవారి దీవెనలు అందించాలి

– నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు



ఏలూరు,మేజర్‌న్యూస్ : మూలవిరాట్ శ్రీశ్రీశ్రీ పాత గంగానమ్మ అమ్మవారికి సారే సమర్పించిన మేయర్ కుటుంబం.ఏలూరు నగర ప్రజలకు గంగానమ్మ అమ్మవారు చల్లని దీవెనలు అందించాలని వేడుకున్నామని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ హిందూ ప్రాచీన సాంప్రదాయాలను అనుసరించి 150 సంవత్సరాలుగా సాంప్రదాయంగా ప్రతి 7 సంవత్సరాలకు ఒకసారి పడమర వీధి గంగానమ్మ జాతర నిర్వహిస్తున్నారన్నారు.పడమరవీధి వాస్తవ్యులైన మేయర్ కుటుంబం ప్రతి జాతరకు అమ్మవారికి సారెసమర్పిస్తామన్నారు. ఈసారి జాతర సందర్భంగా ఈరోజు మూలవిరాట్ శ్రీశ్రీశ్రీ పాత గంగానమ్మ అమ్మవారి ఆలయంలో వేంచేసి ఉన్న గంగానమ్మ అమ్మవారికి మేయర్ కుటుంబం తరపున అమ్మవారికి పసుపుకుంకుమ, గాజులు,చీర,పళ్ళు ఫలహారాలు సారే సమర్పించామని మేయర్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు.ఏలూరు నగరంలో జరుగుతున్న జాతర మహోత్సవాలు అన్నింటికి శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.నగరపాలక సంస్థ మేయర్‌గా అన్ని జాతర మేడల వద్ద కార్పొరేషన్ పరంగా తీసుకోవలసిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేషన్ అధికారులకు ఆదేశించడం జరిగిందని మేయర్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు. పాత గంగానమ్మ ఆలయ నిర్వాహకులు చదరబోయిన శ్రీనివాసరావు, పాతూరి వెంకటేశ్వరరావు,గోవాడ శ్రీనివాసరావు,వేమూరి నాగలక్ష్మి,నేరుసు భాస్కరరావు,నాగులపల్లి శ్రీనివాసరావు, యశోదమ్మ తదితరులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జాతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కమిటీ సభ్యులు మేయర్ నూర్జహాన్ పెదబాబును ఘనంగా సన్మానించి అమ్మవారి తాంబూలాన్ని అందించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు డప్పు వాయిద్యాలు,కోలాటక నృత్యాలతో మేయర్ నూర్జహాన్ పెదబాబుకు తొలుత ఘన స్వాగతం పలికారు.

## దివంగత బిషప్ జాన్ ములగడకు నివాళులు



పెదవేగి,మేజర్‌న్యూస్: సెయింట్ జోసెఫ్ దంత కళాశాల ఫౌండర్, చైర్మన్ మోస్ట్ రెవ.జాన్ ములగడ 88వ జయంతి సందర్భంగా కళాశాల ఆవరణలో కరస్పాండెంట్, సెక్రటరీ మోజెస్ ఘనంగా నివాళులర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలంకరణ చేశారు. ఈకార్యక్రమం ప్రస్తుత చైర్మన్ మోస్ట్ రెవ.బిషప్ జయరావు ఆదేశాలతో కరెస్పాండెంట్ నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ ఎన్. స్లీవరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పక్కకు ఒరిగిన ఫైబర్ నెట్ సిమెంట్ స్తంభం



నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్: మండలంలోని యర్రంశెట్టి వారి పాలెం పంచాయితీలో ఎల్బీచర్ల వెళ్లే రహదారి నివాసాల మధ్యలో ఏపీ ఫైబర్ నెట్ వారు వేసిన సిమెంట్ పోలు ఒక ప్రక్కకు ఒరిగిపోయింది. పక్కనే పంట పొలాలు ఉండటంతో ఏ సమయంలోనైనా స్తంభం పడిపోయే అవకాశం ఉన్నదని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆ సిమెంట్ పోల్ ఏపీ ఫైబర్ నెట్ వారు సరైన స్థానంలో నిలబెట్టాలని గ్రామస్తులు గ్రామస్తులు కోరుతున్నారు. సుగసాని గంగయ్య సహా పలువురు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు తలచుకుంటే దేనినైనా సాధించగలరు





**- తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి చౌదరి**
**- సక్షమ్ ఆధ్వర్యంలో 450మంది దివ్యాంగుల సమ్మేళనం**
**- వీల్ చైర్స్, లామినేషన్ మిషన్లు పంపిణీ**

**భీమడోలు,మేజర్‌న్యూస్ :** దివ్యాంగులకు శరీరంలో కొన్ని పరిమితులు ఉండవచ్చు కానీ వారి మనస్సు,సంకల్పం సామాన్యమైనది కాదని అత్యంత శక్తివంతమైనది అని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపనచౌదరి )అన్నారు. సక్షమ్ జాతీయస్థాయి యువజన కార్యక్రమంలో భాగంగా శనివారం భీమడోలులో డా.కాట్రగడ్డ కళ్యాణ మండపంలో జరిగిన దివ్యాంగుల సమ్మేళనంలోసుమారు 450మంది దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ?ఈ సమ్మేళనంలో దివ్యాంగుల కోసం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి. సునీల్ కుమార్ అధ్యక్షత నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గారపాటి చౌదరి మాట్లాడుతూ దివ్యాంగులు తలచుకుంటే దేనినైనా సాధించగలరని, ఐఏఎస్ అధికారిగా, గొప్ప పారిశ్రామికవేత్తగా, మేధావిగా ఎందరో దివ్యాంగులు ప్రపంచానికి మార్గదర్శకులుగా నిలిచారని అన్నారు. దివ్యాంగులు తలచుకుంటే దేనినైనా సాధించగలరనేది కేవలం మాట కాదు, చరిత్ర నిరూపించిన సత్యంఅన్నారు. దివ్యాంగుల పట్టుదల ముందు లక్ష్యం ఎంత పెద్దదైనా చిన్నబోవాల్సిందే అనిఅన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు ప్రత్యేక బహుమతులను గారపాటి చౌదరి అందజేశారు. క్రీడలు, ఉద్యోగం తదితర రంగాల్లో ఉన్నత స్థాయిని సాధించిన దివ్యాంగులను ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనంలో మాధురి స్కూల్ కరస్పాండెంట్ ప్రేమ్ కుమార్, సత్యేంద్ర స్కూల్ ప్రిన్సిపాల్ సత్యేంద్ర, నేచురోపతి వైద్యులు కే. దీప్తి నాగ లత, దివ్యాంగ సంఘ నాయకులు నాగభూషణం, సక్షమ్ జిల్లా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అల్లవరంలో పర్యటించిన మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ 'కొల్లు'



**అమలాపురం/నరసాపురం,మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి విద్యశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశం మేరకు ఆంధ్రప్రదేశ్ మత్స్యకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు మత్స్యకార గ్రామాలలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆదివారం అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గ అల్లవరం మండలం లో వివిధ గ్రామాలతో పాటు గోడితిప్పలో మత్స్యకారులు ఇబ్బందులు,సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీ సమస్యలన్నిటిని స్థానిక ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనంద్ రావు తో చర్చించిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి మత్స్యకారుడిని ఆదుకుని ఆర్థికంగా స్థిరపడే విధంగా మత్స్యకార పిల్లలు విద్యావంతులు చేసే విధంగా కార్యచరణ రూపొందిస్తున్నారని అన్నారు.పాత బోట్లు రిజిస్ట్రేషన్ విషయము, ఓ యన్ జి సి రిలయన్స్ ద్వారా వచ్చే నిధులతో మత్స్యకార గ్రామాలు డెవలప్ చేయాలని ఎన్ కొత్తపల్లి గోదావరి పాయ బ్రిడ్జిగ్ చేయలని సముద్ర నది తీర ప్రాంత భూములు పట్టాలి పెంచాలని కోరగా అది ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అనంతరం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావుని కలిసి పర్యటనలో భాగంగా వచ్చిన ఫిర్యాదులన్నీ వారికి వివరించి మత్స్యకారులు సమస్యలు అన్ని పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లంకే భీమరాజు,అచ్చయ్య శ్రీను, చింతా శ్రీను,కొప్పాడి రామకృష్ణ,కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడ సత్యనారాయణ, కొల్లు బాబ్జి, మల్లాడి ఉమామహేశ్వరరావు, కొల్లు సూర్యనారాయణ, పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెకు మన ఎమ్మెల్యే చిర్రి అన్న

**- నేడు అంకన్నగూడెం,రాచన్నగూడెంలో పర్యటన**



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పల్లె పల్లెకి మన ఎమ్మెల్యే చిర్రి అన్న' కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరించనున్నామని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు స్పష్టం చేశారు.ఈసందర్భంగా ఆయన ప్రకటనలోపేర్కొంటూ ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమం ద్వారా మండల వ్యాప్తంగా ఉన్న సమస్యలను ఒకే వేదికపై అర్జీల రూపంలో స్వీకరిస్తున్నామని, దీనికి తోడుగా గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అభివృద్ధి అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పల్లె పల్లెకు ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జీలుగుమిల్లి మండలంలోని అంకన్నగూడెం పంచాయతీలో గ్రామాల్లో పర్యటిస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రాచన్నగూడెం పంచాయతీలో ప్రజలతో మమేకమై వినతులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు.ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సంబంధిత అధికారులు, కూటమి నాయకులు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరిం చాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు విజ్ఞప్తి చేశారు.

## సిఎం సహాయ నిధి అందజేసిన విప్ బొమ్మిడి నాయకర్



**మొగల్తూరు,మేజర్ న్యూస్ :** మండలంలోని వారతిప్ప గ్రామానికి చెందిన వీరవల్లి అశ్విని కుమారికి రూ. 28,400 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఆదివారం అందజేశారు.బాధితులకి తక్షణ సహాయం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందించే ఈ సహాయాన్ని, అవసరమైన వారికి చేరవేస్తూ,నరసాపురం నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు వివిధ చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాలమహానాడు వ్యవస్థాపకులు పివి రావుకు ఘన నివాళులు



**పాలకొల్లు,మేజర్ న్యూస్ :** మాలమహానాడు వ్యవస్థాపకులు స్వర్గీయ పి వి రావు 20వ వర్ధంతి సందర్భంగా పి వి రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు సూర్యవరప్రసాద్ రావు గుమ్మాపు నాయకత్వంలో గాంధీ బొమ్మల సెంటర్ నందు ముందుగా ప్రపంచ మేధావి డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ముందుగా పూలమాలలు వేసి తరువాత పివి రావు ప్లెక్సీకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.స్వర్గీయ పి వి రావు డా బి ఆర్ అంబేద్కర్ ఆశయసాదన కోసం ఎంతో శ్రమించి దళితుల అభివృద్ధి కోసం, దళితుల అభివృద్ధి పథకాల కోసం నిరంతరం శ్రమించి దళితుల ఐక్యత కోసం,ఎంతో కృషి చేయటమే కాకుండా,ఎస్సి వర్గీకరణ వ్యతిరేకత కోసం అయన ప్రాణాలను కూడా త్యాగం చేసిన మహెూన్నతమైన ఉద్యమ నాయకుడు అని అన్నారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మానుకొండ. శ్రీనుబాబు, కొర్రపాటి వీరాస్వామి, పీతాని పుష్పరాజు,ఉప్పె పండుబాబు, వర్ధనపు పెదకాసు,చేరుగొండి పద్మకిశోర్, ఆనంద్,తదితరులు పాల్గొన్నారు,

# శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో విజయనగరం భక్తుల సంకల్ప దీక్ష




**వాసవి పెనుగొండ,మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రాంతానికి చెందిన భక్తులు తమ గ్రామంలో శ్రీ వాసవి అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టాలని భక్తిశ్రద్ధలతో సంకల్పించారు. ఈ సంకల్పాన్ని కార్యరూపం దాల్చే దిశగా తొలి అడుగుగా పెనుగొండలోని ప్రసిద్ధ శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రాన్ని దర్శించి ప్రత్యేక సంకల్ప దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వాసవి హెూమంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృప కోసం ప్రార్థనలు చేశారు. హెూమ కార్యక్రమం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శాంతియుతంగా సాగింది.

గ్రామంలో వాసవి అమ్మవారి ఆలయం నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడంతో పాటు, భక్తులందరికీ ఐక్యత, ధార్మిక చైతన్యం మరింత పెరుగుతుందని వారు తెలిపారు.శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రం నిర్వాహకులు భక్తులకు ఆశీర్వచనాలు అందజేస్తూ, వారి సంకల్పం నెరవేరాలని అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు ఈ దీక్ష తమ జీవితాలకు శాంతి, సద్గుణాలు, సుఖసమృద్ధిని ప్రసాదిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆనందోత్సాహాల మధ్య తెలగ,కాపు ఆత్మీయ సమ్మేళనం





**నరసాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** నియోజకవర్గ స్థాయిలో మండలంలోని సీతారాంపురంలో ఆదివారం తెలగా కాపు ఆత్మీయ సమ్మేళనం అట్టహాసముగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఈ కుటుంబాలకు చెందిన సుమారు 25వేల మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సందర్భంగా మహిళలకువివిధ రకాల పోటీలు,చిన్నారులకు మ్యూజికల్ చైర్స్ ఇతర పోటీలు నిర్వహించారు. యువతులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ మునుపెన్నడూ చూడనటువంటి విధంగా పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా తరలిరావడం ఎంతో గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే ఉంటే ఎన్నో విజయాలు సాధించగలమన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కొత్తపల్లి జానకిరామ్, బందారు మాధవ నాయుడు, నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సురేష్, పట్టణ మండల కన్వీనర్లు తమ్మిశెట్టి బాబ్జి, అడబాల అయ్యప్ప నాయుడు తదితరులు మాట్లాడుతూ సంఘం బలోపేతమైనప్పుడే అందరూ ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందవచ్చును అన్నారు. ఈ సందర్భంగా లక్కీ డ్రా నిర్వహించారు.

మొదటి బహుమతి వాషింగ్ మిషన్, రెండో బహుమతిగా లేడీస్ సైకిల్, మూడవ బహుమతిగా గ్రైండర్లు గెలుపొందిన వారికి అందజేశారు. ఈ కార్యక్రమం దాసరి శ్రీనివాస్, పులకడం వీర రాఘవులు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, సినీనటుడు ఉలిశెట్టి శ్రీనివాస్, వన్నెంరెడ్డి శ్రీనివాస్, గుగ్గిలపు మురళి, పులపర్తి ప్రతాప్, యర్రంశెట్టి నాగేశ్వరరావు,చినమిల్లి వీరబాబు తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

## బాలోత్సవం విజేతలకు బహుమతి ప్రదానం




**ఏలూరు,మేజర్ న్యూస్ :** పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం బాలోత్సవం వంటి బహుముఖ ప్రజ్ఞా పాటవాలను వెలికి తీసే వ్యవస్థ ద్వారా కలిగించవచ్చని హేలాపూరి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు కార్యనిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు సి ఆర్ రెడ్డి కాలేజీ ఆడిటోరియంలో హేలాపురి ఆరవ బాలోత్సవం విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు మారుమూడి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది వందల మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు జిల్లా నలుమూలల నుండి గెలుపొందిన విద్యార్థులకు భాగవతం నిర్వాహకులు బహుమతులు రూపంలో మెడల్స్ సర్టిఫికెట్స్ మెమెంటోస్ విద్యార్థులకు ప్రముఖుల చేతుల మీదుగా అందజేశారు ఈ సందర్భంగా ఆలపాటి,దేవరకొండ,గుడిపాటి మాట్లాడుతూ హేలాపురి బాలోత్సవం గత ఆరేళ్లుగా ఏలూరు నగరంలో విద్యార్థుల్లో ఉన్న శాస్త్ర సాంకేతిక అంశాలతో పాటు జానపద కళలు సాంస్కృతిక కళలు అధునాతన టెక్నాలజీకి సంబంధించిన విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడిందన్నారు.

బాలోత్సవ నిర్వహణకు సహకరించిన విద్యార్థులకు యాజమాన్యాలకు ఉపాధ్యాయులకు దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బాల స్వామి నిర్వాహకులు మేతర అజయ్ బాబు,ముస్తఫ అలీ ఎస్ ఎన్ కట్ట, కస్తూరి రావు దివ్వి హేమ సుందర్ నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు

## శివశక్తి 10వ సంవత్సర వేడుకలకు తరలి వెళ్ళిన బృందం



**చాట్రాయి, మేజర్‌న్యూస్:** మండలంలోని చనుబండ నుండి విజయవాడలో జరుగుతున్న శివశక్తి పదవ సంవత్సర వేడుకలకు తరలి వెళ్లినట్లు శివశక్తి మండల కన్వీనర్ నెక్కలపు వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి ఒక్కరిని ఆధ్యాత్మిక భావనలతో మెలిగేలా చేయటమే శివశక్తి యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి ఒక్కరు హిందూ సాంప్రదాయాలను,హిందూ మతాన్ని గౌరవించేలా చేయటమే లక్ష్యమన్నారు. భారతదేశంలో అడుగడుగునా ఆధ్యాత్మికత, చరిత్ర ఉట్టిపడేలా, యుగపురుషులు కలియతిరిగిన ఆనవాళ్లు ఉన్నాయన్నారు. శివశక్తి దశ వర్ష విజయ శంఖారావానికి సామాన్యులు సైతం తరలిరావడం సంతోషకరమన్నారు. కార్యక్రమానికి కొత్తగుండ్ల రమేష్, గోపికృష్ణ, భూషణం తదితరుల ఆధ్వర్యంలో 36మంది శివశక్తి బృందం సభ్యులు తరలి వెళ్లారు.

# 16 నుండి పారిజాతగిరిలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్ని జీయర్ స్వామివారి మంగళ శాసనములతో ధనుర్మాస వ్రత మహోత్సవములు ఈ నెల 16వ తేదీ జయవారం నుండి జనవరి 142026 వ తేదీ బుధవారం వరకు ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అల్లూరి రామకృష్ణ,కార్యనిర్వాహణ అధికారి కలగర శ్రీనివాస్ ఆలయ అభివృద్ధి కమిటీ ఆదివారం మీడియాకు తెలిపారు.

ఈనెల 16వ తేదీ జయవారం సాయంత్రం 6,11 నిమిషాలకు ధనుర్మాసం ప్రారంభం జరుగునని,17వ తేదీ బుధవారం నుండి జనవరి 14వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 5,30ని.ల నుండి 7 గంటల వరకు తిరుప్పలై సేవా కాలం,తీర్థప్రసాద గోష్టి జరుగునని తెలిపారు.

ఈ ధనుర్మాసంలో ఈ నెల 30న జయవారం ఉదయం 5 గంటలకు శ్రీ వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) సందర్భంగా విశేష అలంకరణతో ఉత్తర ద్వార దర్శనం,జనవరి 8వ తేదీ గురువారం ఉదయం 6,30 లకు దీపోత్సవం,జనవరి 11వ తేదీ ఆదివారం ఉదయం 10,30 కూడారై మహోత్సవం, జనవరి 14వ తేదీ బుధవారం ఉదయం 10, 30లకు శ్రీ గోదా రంగనాదుల కళ్యాణ ఉత్సవం జరుగునని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకొని,స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## చాట్రాయిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



**చాట్రాయి, మేజర్ న్యూస్,** చాట్రాయి మండల కేంద్రంలోని సచివాలయంలో ఆదివారం విజయవాడ అమరావతి కంటి ఆసుపత్రి వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ శిబిరంలో 150 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు అవసరమైన వారికి మందులు అందజేశారు. 37 మందికి కళ్ళజోళ్ళు, 9 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం కళ్ళజోళ్ళు అందజేసి ఆపరేషన్ అవసరమైన వారిని తీసుకువెళ్లనున్నట్లు డాక్టర్ కోటేశ్వరరావు తెలిపారు.

## 'దేశం' ఇంచార్జ్ రామరాజు పుట్టినరోజు వేడుక



**నరసాపురం, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పుట్టినరోజు సందర్భంగా మండలంలోని సరిపల్లి కాలనిలో నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, నరసాపురం మండల ప్రధాన కార్యదర్శి డి సి వైస్ చైర్మన్ అందే రామకృష్ణ, సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు సంధి నరసింహారావు, సరిపల్లి గ్రామ అధ్యక్షులు కేదాసు శోభనరావు, ఒడుగు వడ్డికాసులు, కో-యూనిట్ కర్రం రాంబాబు, కేదాసు బాబులు, ముక్కు బాబూరావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, కొప్పిరెడ్డి నాగు, కడిమి శ్రావణ్ కుమార్,నాగిడి రాంబాబు, కోరిపల్లి వాసు, వడ్డీ ముక్తేశ్వరావు, కడలి మసన్ రావు, దొంగ మురళీ, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ ను కట్ చేశారు. సోమవారం రామరాజు పుట్టినరోజు ఒకరోజు ముందుగానే ఈ కార్యక్రమం జరిగింది. సోమవారం ఉదయం పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేయనున్నారు.

## విస్సాకోడేరు వంతెన నుండి కలెక్టరేట్ వరకు సోలార్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు

**- జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



**భీమవరం,మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్రమైన భీమవరంలో విస్సాకోడేరు వంతెన వద్ద నుండి జిల్లా కలెక్టరేట్ నుండి భారతీయ విద్యా భవన్ వరకు సోలార్ ప్యానల్ లైటింగ్ ఏర్పాటు చేయుటకు ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హౌసింగ్ బోర్డ్ కళావేదిక పార్కులోకూడా సోలార్ లైటింగ్ ఏర్పాటు చేయుటకు మున్సిపల్ కమిషనర్ సూచించారు. డిసెంబరు 20 తేదీన రాష్ట్ర విద్యుత్ శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ రానున్న సందర్భంగా ఆయన చేతుల మీదుగా ఏర్పాటు చేయుటకు మున్సిపాలిటీ, భారతీయ విద్యా భవన్, తిరుమల స్కూల్స్ వారు ఆర్కె సోలార్ ప్యానల్ వారి సహకారంతో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎం.రామచంద్రారెడ్డి, ఎలక్ట్రికల్ ఇ.ఇ వెంకటేశ్వరరావు, మున్సిపల్ డి.ఇ, భారతి విద్యా భవన్, తిరుమల స్కూల్ యాజమాన్యం, తదితరులు ఉన్నారు.

# ఏలూరు నగరములో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



– కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని ఐఎఫ్‌టియు నగర కమిటీ డిమాండ్

ఏలూరు,మేజర్ న్యూస్ : ఐఎఫ్‌టియు అనుబంధ ఏలూరు అగ్రికల్చరల్ మార్కెట్ యార్డ్ హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సభ జరిగినది. యార్డ్ యూనియన్ ఆఫీసు ఆవరణలో జరిగిన సభకు అధ్యక్షులుగా యూనియన్ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా వారు మాట్లాడుతూ హమాలి కార్మికులు ఐక్యం కావాలని ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు దిశగా కార్మిక వర్గం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలియజేసినారు. వక్తలుగా యార్డ్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కార్మిక సమస్యల పట్ల నిరంతరం ఇఫ్ట్ ఆధ్వర్యంలో ఉద్యమాలను పోరాటాలను ఎప్పటికప్పుడు ముందుకు తీసుకెళ్తున్నారని అదే కార్మిక వర్గానికి రక్షణ కవచంగా ఉంటాదని, ప్రతి సమస్య పట్ల స్పందించే వర్గం కార్మిక వర్గం అని ఆ కోణాల్లో కార్మికులు ముందుకు పోవాలని కోరారు.ఐఎఫ్‌టియు నగర అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ చట్టాలు పరిరక్షించవలసినటువంటి ప్రభుత్వాలు, చట్టాలను తొలగిస్తూ కార్మిక హక్కులను కలరాయిటాన్ని తీవ్రంగా ఖండించారు.ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గంపై మోడీ సర్కార్ పెను దాడుల్లో చేస్తూ నాలుగు లేబర్ కోడెలను ప్రవేశపెట్టినారు. పెట్టు దారి వర్గానికి అనుకూలంగా 10 గంటలు పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సర్కిల్ జారీ చేశారని, ఆ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సమరశీల ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి మీసాల వెంకటరమణ,సందకం అప్పారావు,కోరాడ అప్పారావు,నవుడు నెహ్రూ బాబు, భాస్కరరావు,మజ్జి శ్రీను, గడసాల రమణ మంగరాజు రాము, ధనను విజయ్, నకిరేడ్డి లక్ష్మణ్, సిట్టి శివ, ప్రసాదు, పండు, సూరిబాబు, రామ్మూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి




ఏలూరు,మేజర్ న్యూస్ : అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరు మెయిన్ బజారులో ఏఐటియుసి అనుబంధ ఏలూరు పట్టణ జట్లు లాగుడుబండ్ల కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గంపై పెను దాడులకు పూను కుంటున్నాయని విమర్శించారు.జిల్లా సహాయ కార్యదర్శి పి కిషోర్, ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస రావు మాట్లాడుతూ జట్లు లాగుడుబండ్ల కార్మిక సంఘానికి అన్ని సందర్భాల్లో అండగా ఉంటామని పేర్కొన్నారు. సంఘ నాయకులు గొర్రెల అప్పారావు, ఎస్ సోమేశ్వరరావు, వంగలపూడి గంగరాజు మాట్లాడారు. సంఘం అధ్యక్షులుపుప్పాల కన్నా రావు 2025 జనవరి ఒకటి నుండి నేటి వరకు సంఘం నిర్వహించిన కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు.సంఘం కోశాధికారి పెచ్చేటి శ్రీనివాస్ సంఘం జమా ఖర్చులను సర్వసభ్య సమావేశంలో చదివి వినిపించారు. సమావేశం ప్రారంభంలో ఏఐటీయూసీ పతాకాన్ని బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. సమావేశంలో కరణం సురేష్, ఎస్ బాపూజీ, కంఠం రెడ్డి భాస్కరరావు, పెచ్చెటి నూకరాజు, ఎం మహేష్, వై శ్రీను, జీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి కీర్తి శిఖరం ఆరుద్ర





ఏలూరు,మేజర్ న్యూస్ :సాహిత్యమండలి నందు తెలుగు జాతి కీర్తి శిఖరం ఆరుద్ర శత జయంతి కార్యక్రమాన్ని తెలుగు రాష్ట్రాల్లోనే ప్రప్రధంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగింది. సభాధ్యక్షులు డా. లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి అనేవి నాగరిక సమాజం ఔన్నత్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి. జాతిని ప్రగతిశీలక బాటలో గొప్పగా ప్రభావం చేసిన కవి ఆరుద్ర. ఆయన జనరంజక సినీ గీతాలు, త్వమేవాహం, సినీవాలి మొదలైన కావ్యాలు, సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర మొదలైన పరిశోధన గ్రంథాలు తెలుగు జాతి ఉన్నంత వరకు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. ఆరుద్ర స్మారక సాహిత్య పురస్కార గ్రహీత డా. జి. వి. పూర్ణ చందు మాట్లాడుతూ ఆరుద్ర శత జయంతి వేడుకల్ని ప్రభుత్వమే అధికారికంగా చేయాలని, అలాంటి మహనీయులను ప్రభుత్వాలు విస్మరించడం తెలుగుజాతికే ద్రోహమన్నారు. తొలిసారి ఏలూరు జిల్లాలో ఆరుద్ర సమగ్ర సాహిత్యం పై సాహిత్య సదస్సు పెట్టి, ఆరుద్ర స్మారక అవార్డును ఇవ్వడం అభినందనీయమని అన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి నాగాస్ట్ మాట్లాడుతూ పాలన భాష, బోధనా భాష, న్యాయ స్థానాల భాష ప్రజల మాతృభాష కానప్పుడు తెలుగు జాతి ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.సభా నిర్వాహకుడు లేళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి అరుదైన కార్యక్రమాలు చేపట్టినప్పుడు స్థానికంగా ఉన్న మేధావులు సామాజిక బాధ్యతగా భావించి తోడ్పాటును అందించాలని, ముందు తరాలకు ఆది స్పూర్తిని అందిస్తున్నదని అన్నారు. ఆరుద్ర సాహిత్యంలోని అంశాలపై కానూరి బదరీ నాథ్, మానవతా కోటేశ్వరరావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, పెదపాటి రామకృష్ణ,మజ్జి కాంతారావు, వై.ఆనంద నాయుడు మొదలగువారు ప్రసంగించారు. ఆరుద్ర స్మారక సాహిత్య అవార్డును తెలుగు భాషోద్యమ నాయకులు, ఇప్పటికీ ఆరు పర్యాయాలు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను దిగ్విజయంగా నిర్వహించిన, శతాధిక గ్రంథకర్త సాహిత్య సంపూర్ణ జీవి జి.వి.పూర్ణచందుకు ఇవ్వడం జరిగింది. మహ్మద్ ఖాజావలి నిర్వహణలో ఆరుద్ర సినీ గీతాలను హేలాపురి గాయకులు అద్భుతంగా ఆలపించారు. తెలుగు భాష, తెలుగు జాతి ఔన్నత్యంపై నాట్య గురు మేదరమెట్ల శిరీష శిష్యులు ప్రదర్శించిన తెలుగు భాష గొప్పదనం నృత్యాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో సి. హెచ్. విక్రమ్ కిషోర్, అంబికా రాజా, ఉక్కుసూరి గోపాల కృష్ణ,లక్కోజు గోపి,పోలిమేర హరికృష్ణ, రేవతి రామ కుమార్, బిందు,షేక్ సుభాని, రేమల్లి విజయ కుమార్, లక్కపాము ప్రకాష్ రావు, గురు శర్మ, డి.రాములు, గుండు సుబ్రహ్మణ్యం దీక్షితులు మొదలగు వారు పాల్గొన్నారు.

# బకాయిలు తీర్చి సొసైటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



ఏలూరు,మేజర్ న్యూస్ : ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ది ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ప్రొవెన్షియల్ వర్క్ ఛార్జిడ్ మినిస్టీరియల్ అండ్ లాస్ట్ గ్రేడ్ ఎంప్లాయిస్ కో. ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ నెం.1390 ఏలూరు పశ్చిమగోదావరి జిల్లా 42వ మహాజన సభ కార్యదర్శి జవంగుల బాపయ్య ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా ఏలూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ చిలకపాటి దేవ ప్రకాష్.. నీరు-ప్రగతి సూపరింటెండింగ్ ఇంజినీర్ బి. వెంకటస్వామి.. డిప్యూటీ ఎస్. ఈ. పుట్టా ధనుంజేయులు.. జిల్లా ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్. కార్యదర్శి నెరుసు రామారావు.. జెఏసి నాయకులు ఆర్ ఎస్ హరనాథ్.. కె. పి.వెంకన్న..పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవ ప్రకాష్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో ఇరిగేషన్ ఉద్యోగుల కోసం గత 40 సంవత్సరాలుగా అనేక సేవలను అందిస్తోందని,రుణాలు తీసుకున్న ఉద్యోగులు సకాలంలో బకాయిలు తీర్చి సొసైటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల కు అవసరమైన సందర్భంగా లోన్స్ ఇవ్వటమే కాకుండా ఇరిగేషన్ కో ఆపరేటివ్ సొసైటీ ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగుల పిల్లలుకి ప్రోత్సాహకాలు ఇస్తూ ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సొసైటీ లో ఉన్న నిధులు వెచ్చించి ఆపదలో ఉన్నవారికి ఆదరణ కల్పించడాన్ని కొనియాడారు.వక్తలు హరనాథ్.. కె.పి వెంకన్న. వెంకటస్వామి. ధనుంజేయులు,నెరుసు రామారావు మాట్లాడుతూ ఇరిగేషన్ ఉద్యోగుల సొసైటీ మిగతా. ఉద్యోగుల సొసైటీలకు ఆదర్శంగా నిలిచిందని.గతంలో కూడా ఈ సొసైటీ జిల్లాలో అగ్రగామిగా నిలచిందనితెలిపారు.

## పేకాట శిబిరంపై దాడి : 15 మంది అరెస్టు

ఏలూరు,మేజర్ న్యూస్ : నగరంలోని నిత్య దార్వెటరీలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రెండో పట్టణ ఇన్చార్జి సీఐ లక్ష్మణరావు సిబ్బందితో ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 15 మంది పేకాటరాయలను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 52,233 నగదును స్వాధీనం చేసుకున్నారు అనంతరం వీరిని రెండో పట్టణ పోలీస్ స్టేషన్కు తరలించారు.ఈ 52వేల నగదులో ఐదువేల నగదును బాత్రూంలో దాచినట్లు తెలుస్తుంది. ఈ సొమ్మును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## డా మెండెం సంతోష్‌కు బిఆర్ అంబేద్కర్ విశిష్ట సేవారత్న అవార్డు



గుంటూరు / ఏలూరు, మేజర్ న్యూస్ : గుంటూరులో జరిగిన మాలబంధు – వనవిందు కార్యక్రమంలో అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డా మెండెం సంతోష్ కుమార్‌కి రాష్ట్ర హెూమ్ శాఖ మాజీ మంత్రి మేకతోటి సుచరితచే డా బిఆర్ అంబేద్కర్ విశిష్ట సేవరత్న అవార్డు అందుకున్నారు.ఈ అవార్డు డా మెండెం సంతోష్ కుమార్‌కి గత 35 సంవత్సరాలుగా సమాజానికి చేస్తున్న సేవను గుర్తించిన మాలమహానాడు, మలమహాసభ సంయుక్తంగా నిర్వహించి అవార్డుకి ఎంపిక చేశారు.ఈ అవార్డు ఇచ్చినందుకు నిర్వాహకులు మల్లెల వెంకట్రావు, గొల్ల అరుణ్ కుమార్‌కి సంతోష్ ధన్యవాదాలు తెలిపారు.

# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**– మండల,డివిజనల్,మున్సిపల్ స్థాయిలకు విస్తరణ : జిల్లా కలెక్టర్**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రజాఫిర్యాదులపరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలను సోమవారం మండల,డివిజనల్ ,మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో డిసెంబర్, 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా పిజిఆర్ఎస్‌కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించింది. దీని ద్వారా ప్రజలు తమఫిర్యాదులను సమీపమండలకార్యాలయాల్లో,డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించు కోవచ్చు. అలాగే, ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు,ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్: https://meekosam.ap.gov.in ఫిర్యాదునమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే, 1100టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేయవచ్చు. ఈవ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు.

# నేడు జరిగే వైసిపి మహా ర్యాలీని విజయవంతం చేయండి

**– స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పెంద్ర వీరన్న**



**భీమవరం,మేజర్ న్యూస్ :** ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేదవాడు డాక్టర్ అవ్వాలి పేదవాడికి సరైన వైద్యం అందాలి అనే ఉద్దేశంతో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకురావడం జరిగింది, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకి అప్పచెబుతూ చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందని వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పెంద్ర వీరన్న అన్నారు.

ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి విజయవంతం చేయటం జరిగిందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని నియోజ కవర్గాల నుండి జిల్లా పార్టీ కేంద్ర కార్యాలయాలకు ర్యాలీగా వెళ్లి అనంతరం జిల్లా పార్టీ కార్యాలయం నుండి కేంద్ర కార్యాలయం తాడేపల్లికు ర్యాలీగా కోటి సంతకాల చేసిన పత్రికలను పంపించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ స్టేట్ ఎగ్జిబిటి కౌన్సిల్ మెంబర్, పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పెంద్ర వీరన్న పిలుపునిచ్చారు, అనంతరం ఈనెల 18వ తేదీన అన్ని జిల్లా కార్యాలయం నుంచి వచ్చిన ఈ కోటి సంతకాల పత్రాలను వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్‌ని కలిసి వారికి వివరించి మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ అనే అంశాన్ని తిరస్కరించాలని కోరడం జరుగుతుందని ఆయన వివరించారు.

# ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరులోని కస్తూరిబా విద్యాలయంలో 9, 10వ తరగతి విద్యార్థినులకు సిపిఆర్ పై శిక్షణ ఇచ్చారు. వ్యక్తి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. తద్వారా గ్రామం,రాష్ట్రం, దేశం మొత్తం కూడా ఆరోగ్యంగా ఉంటుందనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా పనిచేయుచున్నటువంటి సంస్థ ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రథమ చికిత్స,హెల్తీ లైఫ్ స్టైల్(ఆరోగ్య జీవన విధానం) కార్డియాక్ అరెస్టు జరిగినప్పుడు చేయవలసిన అత్యవసర చికిత్స సిపిఆర్‌లపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. తర్వాత 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు వివిధ గ్రామాల నుండి వచ్చిన 30 మంది అభ్యర్థులకు ప్రథమ చికిత్స,గృహ వైద్యం,హెల్దీ లైఫ్ స్టైల్, సిపిర్ లపై శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యభారతి,ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ పి.శ్రీనివాసరావు. జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్(రాజమండ్రి) డాక్టర్ ఏ.వి.యల్. నారాయణ, కార్యదర్శి, ఆరోగ్యభారతి (ఆంధ్రప్రదేశ్) దీనదయాల్ హాస్పిటల్ (నాగాయలంక) పాల్గొని అభ్యర్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ కార్యక్రమంలో చింతూరు సేవాభారతి వైద్యులు గంగాధర ప్రసాద్ పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 10,798 కేసుల పరిష్కారం

**– ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి వెల్లడి**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ,ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీ జస్టిస్ డి రమేష్ గారి ఆదేశానుసారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏలూరు వారి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈనెల 13వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కు జిల్లా వ్యాప్తంగా 34 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగినది. వీటిలో ఏలూరులో 9 బెంచీలు, భీమవరం 4,కొవ్వూరు 4 నరసాపురం 4,తణుకు 3 తాడేపలిగూడెం4, పాలకొల్లు 1,నిడదవోలు 1,జంగారెడ్డిగూడెం 2, చింతలపూడి 1,భీమడోలు 1 చొప్పున బెంచిలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన శ్రీమతిగా యస్.శ్రీదేవి ఆదివారం తెలియజేశారు. జాతీయ లోక్ అదాలత్ నందు జిల్లావ్యాప్తంగా 10798 పెండింగ్ కేసులు 238 ప్రీ లిటిగేషన్ కేసులుగా రాజీ చేయడం జరిగిందని, పెండింగ్ కేసులలో 10351 క్రిమినల్ కేసులు,153 మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, 294 సివిల్ కేసులను రాజీ చేయడం జరిగిందని, వీటితోపాటుగా 238 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారించబడ్డా యని తెలిపారు. వీటిలో ఏలూరు 1988,భీమవరం 974, చింతలపూడి 1248 జంగారెడ్డిగూడెం 971 కొవ్వూరు 1092, నర్సాపురం 434, పాలకొల్లు 458, తాడేపల్లిగూడెం 1433, తణుకు 1082 నిడద వోలు 919 మరియు భీమడోలు 153 పెండింగ్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కరించామని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు యస్. శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ–కం– సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**– ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ నాగరాణి**



**భీమవరం,మేజర్ న్యూస్ :** డిసెంబర్ 15వ తేదీ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ అన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే వాటి స్థితి దానికి సంబంధించి ఏమన్నా సమాచారం తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

## కార్టూనిస్టు సుజయ్ కృష్ణకు అభినందన సత్కారం





**విజయవాడ/ఏలూరు,మేజర్ న్యూస్ :** (ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్ట్ సంఘం ) ఆ.కా.సం ఆవిర్భావ దినోత్సవం. సందర్భంగా ఏలూరుకు చెందిన ప్రముఖ కార్టూనిస్ట్, చిత్రకారుడు, కవి, రచయిత, గణిత ఉపాధ్యాయుడు సుజయ్ కృష్ణకు అభినందన జ్ఞాపికతో ఆ.కా.సం.అద్యాక్షులు బాచి,కార్యదర్శులు సన్మానించారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో విశిష్ట అతిధులుగా శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, జస్టిస్ ఎ.వి.శేష సాయి. యాక్టింగ్ చీఫ్ జస్టిస్ హైకోర్టు. పాల్గొన్నారు.

## సవాళ్లను అధిగమించడానికి హిందూ సంఘటన ఒక్కటే మార్గం





**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్ :** జంగారెడ్డిగూడెంలో హిందూ సమ్మేళనం ఈ కార్యక్రమం కేకన్వెన్షన్ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. ఈ సభలో సంచాలకులుగా దాకారపు కృష్ణ వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హయగ్రీవ లలిత శ్రీపీఠం వ్యవస్థాపకులు దుర్గ బాబు విచ్చేశారు. వక్తగా విచ్చేసిన నాగమణి హిందూ కుటుంబ వ్యవస్థలో మహిళ పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ ప్రచారక్ జనార్ధన్ ప్రసంగిస్తూ దేశ విభజన కాలం నుంచి నేటి వరకు హిందూ సమాజం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను సమస్యలను వివరిస్తూ వాటిని అధిగమించడానికి హిందూ సంఘటన ఒక్కటే మార్గమని గత100 సంవత్సరాలుగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ చేస్తున్న కృషిని వివరించారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం సమాజంలోని విద్య విద్య వైద్య వనవాసి కార్మిక రంగాలలో వివిధ వ్యక్తులతో కలిసి పనిచేస్తుందని చెప్పారు. కులాలుగా విడిపోకుండా హిందువులుగా కలిసి ఉన్నప్పుడే దేశం బాగుంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి సుమారు 1200 మంది పాల్గొన్నారు. రాజకీయ సామాజిక క్షేత్రాలను నాయకులు పాల్గొన్నారు.